

యూరియా కోసం అర్ధరాత్రి పడిగాపులు



యూరియా కోసం నస్కల్ గ్రామంలోని రైతు వేదిక వద్ద రైతులు అర్ధరాత్రి నుంచి వరుసలో కూర్చున్నారు.
-నిజాంపేట





అందాల కడలి..

కడలి వనం ఫ్రేం, ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ గురువారం నారాయణఖేడ్‌లో సందడి చేశారు. ఇక్కడ నారాయణి మెగా షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు.



వదలని వాన



కోహీర్‌లో దెబ్బతిన్న మక్కజొన్న పంట



ఝరాసంగంలో పత్తి చేనులో వర్షపు నీరు



తూప్రాన్ గాయత్రీ నగర్ కాలనీలో నిలిచిన వరద నీరు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు

రామచంద్రపురంలో 94.5 మి.మీ., మనోహరాబాద్‌లో 85.6 మి.మీ.

రోడ్లు, కాలనీలు జలమయం

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ముఖ్యంగా రామచంద్రాపురం, ఝరాసంగం, నారాయణఖేడ్, కంగ్టి, తూప్రాన్, మనోహరాబాద్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, కాలనీలు నీటమునిగాయి, పంట పొలాలు జలమయమయ్యాయి.

కోహీర్/రామచంద్రాపురం/ఝరాసంగం/నారాయణఖేడ్/తూప్రాన్/మనోహరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురిశాయి. సంగారెడ్డి జిల్లాలో రామచంద్రపురంలో 94.5 మిల్లీమీటర్లు, మెదక్ జిల్లా పరిధిలోని మనోహరాబాద్‌లో 85.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. సంగారెడ్డి జిల్లాలో బీహెచ్ఈఎల్ 88.3, పటాన్‌చెరు 73.8, మల్‌చేల్మ 69.5, ఝరాసంగం 67.0, జిన్నారం 64.0 గుమ్మడిదల 63.8, దిగ్వాల్ 62.8, కోహీర్ 62.0, గుండ్లమాచునూర్ 58.8, మునిపల్లి 57.3, కంకోల్ 53.0, హత్నూర 49.8, సుల్తాపూర్ 47.0, సంగారెడ్డి 44.4, సత్వార్ 45.5, కంది 45.0, మొగుడంపల్లి 44.8, నల్లవల్లి 39.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మెదక్ జిల్లా శివ్వంపేట 73, దొంగల ధర్మారంలో 59, కాళ్లకల్ 53.8, నర్సాపూర్ 44.8, కగజ్‌మద్దూరు 44.0, నార్లాపూర్ 43.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

నీట మునిగిన గాయత్రీనగర్

తూప్రాన్‌ను మరోసారి భారీ వర్షం ముంచెత్తింది. నెల రోజుల్లో నాలుగోసారి గాయత్రీనగర్ కాలనీ నీటమునిగింది. రావెల్లి చెరువు, తూప్రాన్ కొత్త చెరువు, పెద్ద చెరువు నిండి అలుగు పారడంతో కాలనీ జలమయమైంది. వరద ఉధృతికి తూప్రాన్-నర్సాపూర్ రహదారి కోతకు గురైంది. పలుచోట్ల దుకాణాల్లోకి నీరు చేరింది. హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తూప్రాన్-కిష్టాపూర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గాయత్రీనగర్ కాలనీలో వరద కారణంగా ఒక ఆసుపత్రిలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి నీరు చేరింది. ఈ విషయాన్ని గమనించకుండా బుధవారం రాత్రి అక్కడ మంచంపై నిద్రించిన వ్యక్తిని ఉదయం స్థానికులు గమనించి నిద్ర లేపి బయటకు తీసుకువచ్చారు.

జలదిగ్బంధంలో కార్యాలయాలు

మనోహరాబాద్‌లోని ఎల్లమ్మ పెద్ద చెరువు నిండి అలుగు పారడంతో ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్‌కు వెళ్లే మార్గం నీటమునిగింది. దీంతో ఉద్యోగులు, ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో గ్రామ శివారులోని ప్రైవేటు వెంచర్‌లో అద్దె భవనంలో కొనసాగి

మిగతా 8వ పేజీలో

సర్వేకు ససేమిరా!

డబుల్‌బెడ్రూం కాలనీ లబ్ధిదారుల ఆందోళన



అధికారులను అడ్డుకుంటున్న లబ్ధిదారులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయంలో లబ్ధిదారుల లెక్క తేల్చడానికి అధికారులు చేపట్టిన సర్వేను స్థానికులు అడ్డుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మూడుచోట్ల 20వేల డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేశారు. ఇంకా పూర్తిస్థాయిలో లబ్ధిదారులు ఇళ్లలోకి రాకపోవడం, కొందరు అద్దెలకు ఇవ్వడం వంటివి చోటుచేసుకుంటున్నాయని అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లలో నిజమైన లబ్ధిదారులు ఉన్నారా? లేరా? అనే విషయం తేల్చడానికి అధికారులు సర్వేను ప్రారంభించారు. గురువారం ఉదయం కొల్లూరులోని కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో సర్వే కోసం వచ్చిన మున్సిపల్ అధికారులను లబ్ధిదారులు అడ్డుకున్నారు. గృహసముదాయాల్లో వసతులు కల్పించలేదని మండిపడ్డారు. పిల్లల చదువులు మధ్యలో ఉండటంతో ఇది వరకు ఉంటున్న ప్రాంతాన్ని వదిలి ఎలా వస్తామని మండిపడ్డారు.



తేలని లెక్క

వరద తగ్గినా పంట నష్టం వివరాలు తేల్చని అధికారులు


ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూపులు

మెదక్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెతుకుసీమను ఇటీవల కురిసిన భారీవర్షాలు అతలాకుతలం చేశాయి. హల్దీవాగు, మంజీరా నదితోపాటు చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కట్టలు తెగి వరద నీరు పొలాలను ముంచెత్తడంతో వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఆరుగాలం కష్టం వరద పాలవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే, వరదలు తగ్గినా అధికారులు పంట నష్టం లెక్కలు తేల్చడం లేదు. రెండు వారాలుగా నష్టం లెక్కలు ప్రకటించకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగైతే ప్రభుత్వం నుంచి సాయం అందుతుందో.. లేదోనని రైతులు వాపోతున్నారు. పంట నీట మునగడంతో విత్తనాలు, ఎరువులు, దుక్కులు, కలుపు

మిగతా 8వ పేజీలో



రేగోడులో నీట మునిగిన పంటలు




సంగారెడ్డి ఏఎస్పీగా రఘునందన్‌రావు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి అదనపు ఎస్పీగా సీహెచ్ రఘునందన్‌రావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు సంగారెడ్డి అదనపు ఎస్పీగా పనిచేసిన ఎ.సంజీవరావు జూలై 31న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉన్నది. రాష్ట్రవ్యాప్తంగా 12 మంది అదనపు ఎస్పీలకు కొత్తగా పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని పోలీసు అకాడమీలో డీఎస్పీగా పనిచేసి పదోన్నతి పొందిన సీహెచ్.రఘునందన్‌రావును సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎర్రబారిన పచ్చని పొలాలు

వర్షం మాటున పరిశ్రమల వ్యర్థ జలాల విడుదల 7





కొండముచ్చులు దొరికాయి


కొండముచ్చులను జాలీలో బంధించిన అటవీశాఖ అధికారులు

జహీరాబాద్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో వారం రోజులుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన కొండ ముచ్చులైతే ఎట్టకేలకు దొరికాయి. కొండ ముచ్చులను పట్టుకోవడంతో ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. వారం రోజులుగా దాదాపు 10మందిపై దాడులు చేశాయి. రాష్ట్ర జాగోతెలంగాణ అధ్యక్షుడు రాములునేత, నాయకులు ఇమ్రాన్, మాదీనం శివప్రసాద్ అటవీశాఖ జిల్లా అధికారి శ్రీధర్‌రావు, జహీరాబాద్ మున్సిపల్‌కమిషనర్ సుభాష్‌రావు తదితరులపై ఒత్తిడితేవడంతో వారంతా వారం రోజులుగా శ్రమించి కొండ ముచ్చులను పట్టుకునే వారిని అప్పగించారు. దీంతో వారు గురువారం పట్టణంలో అవి సంచరించే ప్రాంతాల్లో తిరిగి సుమారు 20 కొండ ముచ్చులను పట్టుకుని ఇనుపజాలీలో బంధించి అటవీప్రాంతాలకు తీసుకువెళ్లారు.

ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం

మహిళ దుర్మరణం


ప్రమాదానికి కారణమైన ట్యాంకర్, ఫొటోలు, వీడియోలు తీస్తున్న జనం

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఓ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఓ మహిళ దుర్మరణం పాలలైంది. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో రెడ్ సిగ్నల్ పడినప్పటికీ లారీ ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా ముందుకు నడిపాడు. ముందున్న ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ మహిళ లారీ చక్రాల కింద పడి శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. సదాశివపేట పట్టణానికి చెందిన ప్రతాప్ తన భార్య అరుణతో పాటు అత్తమ్మ విజయలక్ష్మి(56)లతో కలిసి ద్విచక్ర వాహనంపై గురువారం సదాశివపేట నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. పోతిరెడ్డిపల్లి చౌరస్తావద్దకు రాగానే ట్రాఫిక్ సిగ్నల్ పడింది. అతడు తన ద్విచక్ర వాహనాన్ని ఆపాడు. సదాశివపేట నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వస్తున్న ట్యాంకర్ ఆపకుండా ముందున్న అతడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి లారీ చక్రాల కింద పడిపోగా శరీరం మొత్తం నుజ్జునుజ్జయింది. ఈ దృశ్యాన్ని అక్కడ గుమిగూడిన కొందరు తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరిస్తుండగా, మరికొందరు వీడియోలు తీస్తున్నారు.ప్రతాప్, అరుణలకు స్వల్ప గాయాలు కాగా సంగారెడ్డి రూరల్ పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై రవీందర్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామ అన్నారు.

20తులాల వెండి బిళ్లలు అపహరణ

నర్సాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని ఓ స్వర్ణకారుడి దుకాణంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 20తులాల వెండి బిళ్లలు అపహరించినట్లు ఎస్సై లింగం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణంలో కృష్ణచారి అనే వ్యక్తి మూడేళ్లుగా తన కులవృత్తి అయిన బంగారు, వెండి నగలకు సంబంధించిన దుకాణం నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి కూడా దుకాణానికి తాళం వేసి వెళ్లి మరుసటి రోజు ఉదయం దుకాణం షటర్ తెరిచి చూడగా దుకాణంలో అంతా చిందరవందరగా సామగ్రి పడి ఉంది. దీంతో అనుమానం వచ్చి చూడగా వెనుకభాగంలో ఉన్న వెంటి లేటర్ తొలగించి దుకాణంలో దూరి రాత్రి చోరీకి యత్నించారు. అంతా వెతకగా గల్లాపెట్టెలో ఉన్న 20తులాల వెండి బిళ్లలు అపహరించారని గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి రోహన్‌ను ఓ ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి చేతికి గాయమైంది. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని కొట్టిన ఉపాధ్యాయుడితో పాటు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తల్లిదండ్రులు యాజమాన్యంతో చర్చలు జరిపారు. విద్యార్థి పదో తరగతి వరకు ఉచిత విద్యనందిస్తామని ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని రూ.50 బాండ్ పేపర్‌పై ఇరువురు ఒప్పందపత్రం రాసుకున్నారు. మరోసారి ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకుంటామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించారు. కాగా ఈ ఘటనపై సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్ పాఠశాలకు చేరుకొని విచారణ జరిపారు. విద్యార్థిని ఎందుకు కొట్టాల్సివచ్చిందనే కారణాలను ఎంఈవో ఆరా తీశారు. ఇలా ఉండగా ఈ ఘటన తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు మహేశ్ పాఠశాలకు చేరుకొని యాజమన్యాన్ని నిలదీశారు. పోలీసులు పాఠశాల ఎదుట బందోబస్తు నిర్వహించారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

కొండపాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాక మండలం దమ్మక పల్లి శివారులోని పిట్టల వాడలో చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టల వాడకు చెందిన గుజరాతి చంద్రయ్య కూతురు రజిత (22) అనే యువతి బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. రజిత వారి దూరపు బంధువైన వ్యక్తిని ప్రేమిస్తున్న విషయం తల్లిదండ్రులకు తెలిసింది. దీంతో తల్లిదండ్రులు చదువు పూర్తయిన తర్వాత చూద్దామని ఏడు నెలల క్రితం చెప్పి ఒప్పించారు. ఇంతలో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పుట్టింటికి వెళ్లిన భార్య రావడంలేదని..

వర్గల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భార్య భర్తల మధ్య జరిగిన గొడవల కారణంగా పుట్టింటకి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మాదారం గ్రామానికి చెందిన అంకని సాయి కుమార్ (36), భార్య శ్యామల, వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వివాహమైనప్పటి నుంచి భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో రెండు సంవత్సరాల క్రితం శ్యామల తన పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం సాయికుమార్ తన భార్య శ్యామల వద్దకు వెళ్లి ఇంటికి రమ్మని చెప్పినా శ్యామల రానన్నది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సాయికుమార్ జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంటి పై కప్పు రేకుల ఇనుప రాడుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి అంకని స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మృతి

నారాయణఖేడ్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలోని హైవే రోడ్డు 161 ఫ్లైఓవర్ కింద 85 సంవత్సరాల వృద్ధురాలు గురువారం సాయంత్రం మృతి చెందింది. పెద్దశంకరంపేట మండలం మల్కాపూర్‌కు చెందిన వడ్డెర చిన్నమ్మ(85) భిక్షాటన చేస్తూ జీవిస్తుందని, ఆమెకు సంబంధించిన వారు ఎవరూ అందుబాటులో లేరని, భిక్షాటన చేసుకుంటూ ఫ్లైఓవర్ వద్ద వృద్ధురాలు మృతి చెందిందని స్థానికులు తెలిపారు.


మరమ్మతు చేస్తూ.. కరెంట్ షాక్‌తో చెరువులో పడి ఆపరేటర్ మృతి


అన్మల నర్సింలు(ఫైల్)

రామాయంపేట,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెరువుకి ఆనుకొని ఉన్న బోరు మోటార్ మరమ్మతు చేసే క్రమంలో ఆపరేటర్ నీట మునిగి చనిపోయాడు. ఘటన రామయంపేట మండల పరిధి లక్ష్మాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అన్మల నర్సింలు(40) రోజులాగే ఊరికి సరఫరా అయ్యే బోర్ స్టార్ట్ చేసేందుకు వెళ్లాడు. అది పనిచేయక పోవడంతో మరమ్మతు చేస్తూ కరెంటు వైర్లు తగిలి అక్కడే ఉన్న చెరువులో పడి ప్రాణాలు కోల్పోయాడు. పోస్టుమార్టం జరిగిన తర్వాత పోలీసులు శవాన్ని కుటుంబీకులకు అప్పగించారు. అయితే ఈ ప్రమాద ఘటనపై సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి నేతృత్వంలో పంచాయతీ సిబ్బంది తోటి కార్మికుడికి న్యాయం చేయాలంటూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.



కాలుష్య జలాలతో ఎర్రబారిన నల్లకుంట చెరువు



ఏరులై పారుతున్న కాలుష్య జలాలు



ఎర్రబారిన పచ్చని పొలాలు

వర్షం మాటున పరిశ్రమల నుంచి వ్యర్థ జలాల విడుదల

గుమ్మడిదల, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా వర్షం అంటే రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తుంది. కానీ గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామికవాడ పరిసర ప్రాంతాల్లో మాత్రం వర్షం పడితే కన్నీరు పెట్టుకుంటున్నారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని పారిశ్రామికవాడలోని దొమడుగు గ్రామ శివారులో ఉన్న రసాయన పరిశ్రమల నుంచి భారీగా కాలుష్య జలాలు నల్లకుంట చెరువులోకి చేరాయి. ఎర్రగా, నల్లగా మారిన ఆ వ్యర్థ జలాలు చెరువు కింద ఉన్న వందల ఎకరాల వరి పొలాలను ముంచెత్తాయి. తెల్లారి పొలాలకు వెళ్లిన రైతులు పచ్చని పంటలు రసాయనాలతో ఎర్రబారిన దృశ్యం చూసి నివ్వెరపోయారు. నల్లకుంట చెరువులో చేపలు చనిపోయి నీటిపై తేలియాడగా, వాటిపై ఆధారపడ్డ మత్స్యకారుల కుటుంబాలు ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశాయి. పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) అధికారులు ఇటువైపు కనీసం తొంగిచూడకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి, కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. వ్యర్థ జలాలను విడుదల చేసిన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఉద్యమిస్తామని రైతులు, మత్స్యకారులు హెచ్చరించారు.



వరి పంటను ముంచిన వ్యర్థ జలాలు

నాలుగు దశాబ్దాలలో 51 లక్షలకుపైగా సర్జరీలు

● 27వేలకుపైగా అవయవ మార్పిడులు

● అపోలో ఆస్పత్రుల సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రి 42వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుందని, దాదాపు 200 మిలియన్లకుపైగా మందికి వైద్య సేవలు అందించడంతో పాటు 185 దేశాలలో నమ్మకాన్ని సంపాదించిదని అపోలో ఆస్పత్రుల సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనను జారీ చేశారు. 1983లో భారతదేశంలో మొట్టమొదటి కార్పొరేట్ ఆసుపత్రి ఏర్పడి, 19000కు పైగా కీలకమైన ప్రాంతాలను చేరుకుందని ప్రకటించారు. అపోలో నాలుగు దశాబ్దాలలో 51 లక్షలకు పైగా శస్త్రచికిత్సలు, 27వేలకు పైగా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు, 22 వేలకుపైగా రోబోటిక్ సర్జరీలు, మూడు మిలియనట్లల నివారణ ఆరోగ్యపు పరీక్షలు, 20 మలియన్లకుపైగా డయాగ్నస్టిక్ పరీక్షలు పూర్తి చేశామన్నారు. ఆరోగ్య సంరక్షణ మానవ మూలధనాన్ని గణనీయంగా పెంచుతూ అపోలో 11 లక్షలకు పైగా నిపుణులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తాము ఆసుపత్రులను మాత్రమే కాకుండా, మానవ వనరులను తీర్చిదిద్దామని ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీత రెడ్డి పేర్కొన్నారు. దక్షిణాసియాలో మొట్టమొదటి ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్, భారతదేశంలో మొట్టమొదటి ఏఐ - ప్రెసిషన్ అంకాలజీ సెంటర్, మొట్టమొదటి సైబర్‌నైఫ్ఎ రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్ వంటి దాని మార్గదర్శక తొలి ఆవిష్కరణలతో కీలకంగా ఉందన్నారు. ఏఐ, రోబోటిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను వ్యాధికి చికిత్స చేయడానికి మాత్రమే కాకుండా, దానిని అంచనా వేయడానికి, నివారించడానికి, ఏకీకృతం చేస్తున్నామని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి తెలిపారు.

రెండు రోజుల్లో 4,096 మంది మహిళలకు పరీక్షలు



డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో రెండు రోజుల్లో స్వాస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద 4,096 మంది మహిళలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్టు సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14 పీహెచ్‌సీలతో పాటు 122 సబ్‌సెంటర్, బస్తీ దవాఖానాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఇందులో ఇప్పటివరకు 1853 మంది బీపీ, 1419 మంది షుగర్, 686 మంది క్యాన్సర్ స్క్రీనింగ్, 585 మందికి మానసిక ఆరోగ్య కోసం కౌన్సెలింగ్, 495 మంది గర్భిణీ మహిళలకు ఏఎన్‌సీ పరీక్షలు, 120 మంది బాలికలు, గర్భిణీల వ్యాక్సినేషన్, 995 మందికి అనీమియా స్క్రీనింగ్, 750 మంది మహిళల ఆరోగ్య సంరక్షణకు కౌన్సెలింగ్, 1180 మంది న్యూట్రిషన్‌పై కౌన్సెలింగ్, 45 మంది సికిల్ సెల్ స్క్రీనింగ్, 526 మందికి టీబీ పరీక్షలు నిర్వహించినట్టు ఆమె వివరించారు.

సింగూరు నుంచి దిగువకు 50 వేల క్యూసెక్కులు

పుల్‌కల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింగూరు ప్రాజెక్టు నుంచి ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా 50,751 క్యూసెక్కుల(ఔట్‌ఫ్లో) వరద నీరు దిగువకు ప్రవహిస్తున్నది. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతూనే ఉన్నది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 49,176 నమోదైంది. గురువారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో 520.655 మీటర్లకు 17.067 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. దిగువన మంజీర రిజర్వాయర్‌కు వదర ప్రవాహం పోటెత్తింది. రిజర్వాయర్ నాలుగు క్రస్ట్ గేట్లను ఐదు మీటర్ల ఎత్తు, ఒక స్కవర్ గేట్ మీటరున్నర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే వనదుర్గా ప్రాజెక్టు (ఘనపురం ఆనకట్టకు) వదులుతున్నారు.

అమెరికా సుంకాలపై భారత్ ప్రతీకారం ఉండబోదు

● ఐఐఎం ఇండోర్ అధ్యాపకుడు డాక్టర్ అజీమ్‌ఖాన్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అమెరికా విధించిన సుంకాలపై భారత్ ప్రత్యక్ష ప్రతీకార చర్యలకు దిగబోదని ఐఐఎం ఇండోర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొహమ్మద్ అజీమ్‌ఖాన్ అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ గురువారం నిర్వహించిన ఆన్‌లైన్ ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. భారతదేశం చర్చల ద్వారా సుంకాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తూనే, ఇతర దేశాలకు ఎగుమతి అవకాశాలను పెంచుకునే మార్గాన్ని అనుసరిస్తుందని తెలిపారు. అమెరికా విధించిన 50 శాతం సుంకాల వల్ల భారత వస్త్ర పరిశ్రమ తీవ్రంగా ప్రభావితం అయ్యిందని, దీనివల్ల భారతదేశ జీడీపీ0.3 నుంచి 0.5 శాతం వరకు తగ్గే ప్రమాదం ఉందని అంచనా వేశారు. అయినప్పటికీ, ఇది కొత్త మార్కెట్లను అన్వేషించడానికి దేశానికి ఒక అవకాశంగా ఆయన పేర్కొన్నారు. 2030 నాటికి ప్రపంచంలోని మూడు అగ్ర వాణిజ్య శక్తులలో ఒకటిగా దేశం ఎదగాలనే ఆయన నొక్కి చెప్పారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లో నిర్వహించిన అఖిల భారత థల్ సైనిక్ క్యాంప్ (ఏఐటీఎస్‌సీ)లో పాల్గొన్న గీతం ఎన్‌సీసీ క్యాడెట్ దాసరి ధనిక్ బాబాను యూనివర్సిటీ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, ఎన్‌సీసీ అధికారి అజయ్ ఆయనను అభినందించారు.

సిగాచీ బాధిత కుటుంబాలకు న్యాయం చేయండి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిగాచీ పరిశ్రమ బాధిత కుటుంబాలకు 30 రోజుల్లో పరిహారం అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి 80 రోజులైనా పూర్తి పరిహారం అందలేదని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్ అన్నారు. గురువారం పాశమైలారంలో సిగాచీ పరిశ్రమ బాధిత కార్మిక కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు వారి బాధలు కష్టాలు చెప్పుకుంటూ కన్నీళ్ల పర్యంతం అయ్యారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా జిల్లా అధికారులు, కార్మిక శాఖ ఎందుకు హామీ పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. కార్మికుల అంటే లెక్క లేదన్నారు. రూ.కోటి పరిహారం ప్రకటించి కేవలం 25 లక్షలు మాత్రమే ఇచ్చారన్నారు. పూర్తిస్థాయి పరిహారం వెంటనే బాధిత కుటుంబాలకు ఇవ్వాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు రాజు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో 5.8 కిలోల మత్తుమందు స్వాధీనం

● ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు అరెస్ట్

మాసాయిపేట, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మాసాయిపేటలో పోలీసులు 5.8 కిలోల మత్తు మందును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. మాసాయిపేటలోని పంజాబీ డాబా వద్ద మత్తు మందు తరలిస్తున్నారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో దాడులు చేసి ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాహెల్ పాండే, మనోజ్ పాండే అనే అన్నదమ్ములను అదుపులోకి తీసుకున్నారు. లారీ డ్రైవర్లు అయిన వీరు అక్కడి నుంచి మత్తు మందు తీసుకువచ్చి జాతీయ రహదారి వెంట ఉన్న దాబాల్లో సరఫరా చేస్తుంటారు. వారి నుంచి 5.8 కిలోల మత్తు మందును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

● యువతను, విద్యార్థులను ప్రోత్సహించే దిశగా పోటీలు

● జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

జహీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. 69వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా జహీరాబాద్ రంజోల్‌లో అండర్-14, 17 జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 28 మండలాలలు, 1200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, జ్యోతిని వెలిగించి క్రీడలను అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ యువతను, విద్యార్థులను ప్రోత్సహించేలా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. బడుల్లో ఖాళీగా ఉన్న పీఈటీ టీచర్ల నియమాకానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ఆల్‌ఇండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం బాబానగర్‌కు వెళ్లే అండర్‌బ్రిడ్జీని పరిశీలించి, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇటీవల మృతిచెందిన రెండో వార్డు కౌన్సిలర్ తాహెరాబేగం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



కబడ్డీ ఆడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

ఆన్‌లైన్ సేవలు, అభివృద్ధిపై కితాబు

హుగ్గెల్లి, ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో ఉత్తరప్రదేశ్ బృందం పర్యటన

జహీరాబాద్/ సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రజా ప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారులతో కూడిన బృందం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి మండలాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా హుగ్గెల్లి, ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామాలను సందర్శించి, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, గ్రామీణాభివృద్ధి విధానాలను పరిశీలించారు. జహీరాబాద్ పరిధిలోని హుగ్గెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు వేదిక కార్యక్రమంలో అపార్డ్ సీఈవో రామచందర్‌రావు మాట్లాడుతూ ఆన్‌లైన్ సేవల వల్ల ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గ్రామాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, పరిపాలనా విధానంపై ఉత్తరప్రదేశ్ బృందానికి అవగాహన కల్పించారు. వ్యవసాయ భూములు, పంటలు, మార్కెటింగ్ విధానం వంటి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచిన తీరును వివరించారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలో పర్యటించిన బృందం సభ్యులు, అక్కడి అభివృద్ధిపై ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ రహిత పర్యావరణం, పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, పల్లె దవాఖానలో అందుతున్న వైద్య సేవలను అభినందించారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు, అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల అమలు తీరు చాలా బాగుందని బృందం సభ్యులు కితాబునిచ్చారు. ఈ పర్యటనతో ఎంతో సంతృప్తి చెందామని వారు పేర్కొన్నారు.



హుగ్గెల్లి రైతు వేదికవద్ద ఉత్తర్‌ప్రదేశ్ బృందం

కంది మండలంలో ఉపాధిహామీ కేంద్ర బృందం పర్యటన

కంది, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కంది మండలం చేర్యాల గ్రామాన్ని మహారాష్ట్ర, సోలాపూర్ జిల్లాలకు చెందిన ఉపాధిహామీ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని పనులు విజిట్ చేశారు. సీసీ రోడ్లు, శ్మశానవాటిక, స్కూల్ కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, బాలబాలికల మూత్ర శాలల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం బృహత్‌పల్లె ప్రకృతి వనంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అసిస్టెంట్ పీడీ పూజ, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

యూరియా కోసం రైతుల ధర్నా

శివ్వంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు గురువారం శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూలో గంటల తరబడి వేచిఉన్నారు. ఎంతసేపటికీ యూరియా పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు నర్సాపూర్ - తూప్రాన్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



నర్సాపూర్ - తూప్రాన్ రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

యువకుడి సాహసాన్ని అభినందించిన ఎస్పీ



దేవిసింగ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రాజ్‌పేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బ్రిడ్జిపై చిక్కుకున్న 10 మందిని తండాకు చెందిన దేవిసింగ్ రక్షించాడు. ఆ యువకుడి ధైర్యసాహసాన్ని గుర్తించిన జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో దేవిసింగ్‌ను, ఆయన తండ్రి దనుజానితోపాటు మాజీ సర్పంచ్ కిషన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఒకరినొకరు సహాయపడాలన్నారు. పోలీసు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ శాఖలు భారీ వర్షాలకు వరదల్లో చిక్కుపోయిన 350 మంది ప్రజల్ని కాపాడారని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

'ఏఐఐఈఏ పోరాట ఫలితంగానే బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు'

చేగుంట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏఐఐఈఏ పోరాట ఫలితంగానే బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు అయిందని, దీనిని కోసం 400 మంది ఎంపీలను కలిశామని ఐసీఈయూ సికింద్రాబాద్ డివిజన్ జనరల్ సెక్రెటరీ డీఎస్ రఘు పేర్కొన్నారు. అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం మెదక్ హెడ్ క్వార్టర్స్ ఎల్ఐసీ కార్యాలయంలో జరగనున్న సర్వసభ్య సమావేశానికి వెళ్తున్న క్రమంలో చేగుంటలో గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ అలాగే ఎఫ్‌డీఐ వంద శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందని, దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సంవత్సరానికి రూ.7,324 కోట్ల డివిడెంట్ కింద కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చామని, ప్రభుత్వ ఇన్సూరెన్స్ రంగాన్ని షేర్ మార్కెట్లోకి తీసుకెళ్లడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బీమా రంగం ప్రైవేట్‌పరం కాకూడదని, ప్రభుత్వం వద్దనే ఉంటే ప్రజలకు రక్షణగా ఉంటుందన్నారు. అలాగే ఎల్ఐసీలో మూడో, నాల్గో తరగతి ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఈయూ అధ్యక్షుడు గుణశేఖర్, జనరల్ సెక్రెటరీ డీఎస్ రఘు, అసిస్టెంట్ ట్రెజరర్ ఎండీ జావేద్, ఐసీఈయూ నాయకులు బచ్చు రాములు, కత్తి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లో గ్యాస్ డెలివర్రీ

● బుక్ చేసి వారం రోజులైనా సరఫరా లేదు

● ఏజెన్సీ ఎదుట బారులు తీరిన వినియోగదారులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మెదక్‌లో వంటగ్యాస్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. సిలిండర్‌ను బుక్ చేశాక వారం రోజులు దాటినా ఇంటికి డెలివరీ కావడం లేదు. దీంతో గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో గ్యాస్ ఏజెన్సీ వద్ద ఖాళీ సిలిండర్లను క్యూలో పెట్టి వినియోగదారులు బారులు తీరారు. రానున్న బతుకమ్మ, దసరా పండుగ ముందు గ్యాస్ కొరత ఏర్పడడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రవాణా లారీల సమ్మె కారణంగా సిలిండర్ల కొరత ఏర్పడిందని, కర్నూల్ నుంచి లోడ్ వస్తుందని, ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

చెరువు అలుగు కాలువల ఆక్రమణల తొలగింపు

తూప్రాన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధిలోని భూంచెరువు అలుగు కాలువల ఆక్రమణలను గురువారం అధికారులు తొలగించారు. ఈ కాలువలు కొన్నేళ్లుగా నిండకపోవడంతో కొందరు వాటిని ఆక్రమించి ఇళ్లు, వ్యాపారాలు నిర్మించుకున్నారు. దీంతో వర్షపు నీరు వ్యవసాయ భూములను ముంచి, పంటలకు నష్టం కలిగిస్తోంది. దీంతో రైతులు, గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తూప్రాన్ - నర్సాపూర్ రోడ్డు పక్కనే ఉన్న కాలువల్లోని ఆక్రమణలను తొలగించడానికి ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ ఘటనా స్థలానికి చేరుకోగా, స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే ఎస్ఐ శివానందం వచ్చి పరిస్థితిని చక్కదిద్ది, కాలువలను యథావిధిగా పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో అధికారులు గురువారం ఎక్స్‌కవేటర్ సహాయంతో కాలువలను బాగుచేసే పనులు చేపట్టారు. రైతులు, గ్రామస్థుల సహకారంతో చెరువు నీరు ప్రవహించేందుకు మార్గం సుగమమైంది.

మద్యం మత్తులో సెల్లార్ గుంతలో పడి వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో సెల్లార్ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని నమిలెట్ గ్రామానికి చెందిన బొక్క రామయ్య(45) భార్య వీరమ్మ ముగ్గురు పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. దూలపల్లిలోని మహాలక్ష్మి వెంచర్‌లో ఓ గదిలో ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నాడు. గురువారం ఉదయం మద్యం తాగి ఇంటికి వస్తుండగా, అతడి ఇంటి గది పక్కనే ఉన్న పాత సెల్లార్ గుంతలో పడిపోయాడు, గుంతలోపడిన శబ్దం విన్న భార్య వీరమ్మ గదిలో నుంచి బయటకు వచ్చి చూడగా గుంతలో రామయ్య కనిపించాడు. పక్క నుంచి బయటకు రమ్మని భార్య చెప్పినా వినకుండా మరో పక్క నుంచి బయటకు వస్తానని సెల్లార్ మధ్యలోకి వెళ్లి నీట మునిగాడు. కుమారుడు కిరణ్, భార్య కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి చేరుకుని, మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

● భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం

కొల్చారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీరక దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. భర్త మరణించగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన నిరుడు నర్సింహులు(44), యశోద దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. కాగా వారికి మూడేళ్ల క్రితం అప్పు చేసి వివాహాలు చేశారు. నర్సింహులు తనకున్న ఎకరం న్నర అసైన్డ్ భూమిలో ఏటా సాగు చేసినా అప్పులు తీరలేదు. దీంతో అప్పులు తీరే మార్గం కనిపించక భార్యాభర్తలు ఇద్దరూ ఈ నెల 14న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. ఆ బాధ భరించలేక కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి వారిని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందగా, యశోద ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. నర్సింహులు తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు కార్లను ఢీ కొన్న ట్రావెల్ బస్సు

● బస్సులో ప్రయాణికుడు గుండెపోటుతో మృతి

మాసాయిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మాసాయిపేటలో బుధవారం రాత్రి ఓ ట్రావెల్ స్లీపర్ బస్సు విధ్వంసం సృష్టించింది. 44వ జాతీయ రహదారిపై సాయిబాబా గుడి సమీపంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న బస్సు వేగంగా వచ్చి రెండు కార్లను ఢీ కొన్నది. ఈ సమయంలో బస్సులో నిద్రిస్తున్న ప్రయాణికుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ పాల్(35)కు గుండెపోటు వచ్చింది. తోటి ప్రయాణికులు సీపీఆర్ చేసినా అతని ప్రాణాలు దక్కలేదు. ఈ మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

● మహిళ మృతి..మరొకరి పరిస్థితి విషమం

గుమ్మడిదల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టిన సంఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉండగా, ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదలలో సంతను ముగించుకొని ఆటోలో మొత్తం తొమ్మిది మంది నల్లవల్లి గ్రామానికి బయలుదేరారు. మెదక్-హైదరాబాద్ హైవే రోడ్డులో మంబాపూర్ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని అదుపుతప్పి ఆటో ఢీకొన్నది. ఆటోని నల్లవల్లి గ్రామానికి చెందిన మహిళ ఇందిరా(45) అక్కడికక్కడే మృతి చెందగా, అండూర్ గ్రామానికి చెందిన యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. మిగతా ఏడుగురికి స్వల్ప గాయాలు కావడంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆలయాల సందర్శనకు ఎమ్మెల్యే 'గూడెం'

పటాన్‌చెరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తిరుమల తిరుపతిలో ఆలయాల సందర్శనకు మిత్రబృందంతో వెళ్లారు. గురువారం సాయంత్రం కాణిపాకం వినాయక ఆలయంలో ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం తిరుపతికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం సమయంలో వెంకటేశ్వరస్వామి సన్నిదిలో జరిగే పూజల్లో పాల్గొంటారు.

23న ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్టు సెక్రటరీ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 బాల, బాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు టెన్త్ మెమో, భోనాఫైడ్, బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9440686408, 9848321330 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

పటాన్‌చెరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రత సామాజిక బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందని కమిషనర్ కిషన్ చెప్పారు. వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో ఐడీఏబొల్లారంలో ర్యాలీ జరిపారు. పట్టణంలో పరిశుభ్రత పాటించడానికి ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

గణేష్ ఆలయం హుండీ లెక్కింపు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రుద్రారం గణేష్ దేవస్థానం ఆలయ హుండీ ఆదాయం గురువారం లెక్కించారు. 78 రోజులకు రూ.24,46,712 లక్షల ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపులో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, దేవస్థానం ఈవో లావణ్య, దేవస్థానం చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

'యాత్రదానం సద్వినియోగం చేసుకోవాలి'

జహీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాత్రదానం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ డిపో మేనేజర్ స్వామి, పట్టణ సీఐ శివలింగం పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో యాత్ర దానం పోస్టర్లను అధికారులు విడుదలచేశారు.

'మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందజేయాలి'

ఝరాసంగం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి, బొరెగావ్, కంబాలపల్లి, గుంతమర్పల్లి గ్రామ శివారులోని తమ భూములను తీసుకున్న పవర్ గ్రిడ్ యాజమాన్యం మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఆయా గ్రామాల రైతులు నాగేందర్ పాటిల్, సంగమేశ్వర్, నర్సింలు, సిద్ధప్ప, లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం తహసీల్దార్ తిరుమల రావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మార్కెట్ ధర ప్రకారం తమకు గుంటకు రూ.5 లక్షలు చెల్లించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హవేళిఘణపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మండలంలోని నాగాపూర్‌కు చెందిన శంకర్, సిద్ధిరాములు శివారులోని పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారంతో దాడులు చేసి ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల వద్ద రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సహకార సంఘాల సీఈవోలు, ఆగ్రోస్ కేంద్రాల డీలర్లకు ఏవో లక్ష్మీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని సహకార సంఘం, ఆగ్రోస్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని వెలికితీయాలి : కలెక్టర్

మెదక్ కల్చరల్/పాపన్నపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాన్ని ఉపాధ్యాయులు వెలికితీయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం మెదక్ మండలం మంబోజి పల్లిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో ఉన్న పరిసరాలు, వంటశాల, వాటర్ సౌకర్యాన్ని పరిశీలించి మాట్లాడారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని, వారిని సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. అనంతరం విద్యార్థులతో సరదాగా ముచ్చటించి పలు ప్రశ్నలను అడిగి, సందేహలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇంటికి దీపం ఇల్లాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం పాపన్నపేట పీహెచ్‌సీలో కొనసాగుతున్న స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆరోగ్య వంతమైన కుటుంబం దేశ సంక్షేమానికి కొలమానంగా చూడాలన్నారు. ముఖ్యంగా ఇంటికి దీపమైన ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే, కుటుంబం ఆనందంగా ఉంటుందని చెప్పారు. అందుకే ప్రభుత్వం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు ప్రతీ వైద్య కేంద్రంలో నిరంతర వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మెదక్ కల్చరల్ : విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



కొండాపూర్ : కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలి

కొండాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కొండాపూర్‌లో కస్తూర్బా పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడితే సమీప ఆసుపత్రికి తరలించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం చేయొద్దని హౌసింగ్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో వేణుగోపాల్, గృహ నిర్మాణ, ఆరోగ్యశాఖ అధికారులు, ఆర్ఐ రాజు పాల్గొన్నారు.

నారాయణి షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



నారాయణి మెగా షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో గురువారం నారాయణి మెగా షాపింగ్‌మాల్ సెకండ్ బ్రాంచ్‌ను ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రముఖ సినీనటి నాగదుర్గతో కలిసి వారు జ్యోతి ప్రజ్వలన చేసి గణపతిపూజ నిర్వహించారు. నారాయణి షాపింగ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి రూ.999 కొనుగోలుపై స్పాట్‌గిఫ్ట్, పదిశాతం డిస్కౌంట్, బంఫర్ ప్రైజ్‌గా మూడు షోరూంలలో మూడుకార్లు ఇవ్వడం పట్ల వారు అభినందించారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, సాగర్‌షెట్కార్, యజమానులు విఠల్, వెంకటేశం, పండరి పాల్గొన్నారు. షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా బసవేశ్వర చౌక్ ప్రాంతంలో సందడి నెలకొంది.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులను పట్టుకోవాలి

నిజాంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరస్తులను పట్టుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నిజాంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు జరగాలని, స్టేషన్‌కు వచ్చిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా సైబర్ నేరాల నివారణకు స్కూల్స్, పని ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్సీ ఎస్‌ఐ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

రాత్రి బీట్ డ్యూటీలతో నిఘా కట్టుదిట్టం : ఎస్పీ

పుల్‌కల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పగలు, రాత్రి బీట్ డ్యూటీలతో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం పుల్కల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్‌లో పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, బ్యారక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలని సూచించారు. అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించాలన్నారు. రిసెప్షన్ సిబ్బంది స్టేషన్‌కు వచ్చిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలన్నారు. అనంతరం సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు ర్యాంబుల్ స్ట్రిప్స్, ఇసుక డ్రమ్ములను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్‌ఐ విశ్వజన్ తదితరులు ఉన్నారు.



పుల్కల్ పోలీస్‌స్టేషన్‌లో మొక్కనాటి నీరు పోస్తున్న ఎస్పీ పంకజ్, పక్కన డీఎస్పీ సత్తయ్యగౌడ్

రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వర్తించాలి

కోహీర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా క్రాంతి పథంలో పనిచేస్తున్న వీవోఏలు మహిళా గ్రూపులకు సంబంధించిన ఏడురకాల రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వర్తించాలని సీబీవో (కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజర్) ఆడిటర్ లింగమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రమైన కోహీర్‌లోని ఐకేపీ కార్యాలయంలో ఆయా గ్రామాల వీవోఏలు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పొదుపు సంఘాల గ్రూపులకు సంబంధించిన ప్రతీ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రుణాల మంజూరు, చెల్లింపుల రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కుమార్, అకౌంటెంట్ శేఖర్, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు చంద్రకళ, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డుల నిర్వహణపై వీవోఏలు అవగాహన కల్పిస్తున్న లింగమూర్తి

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ : ఎంపీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. గురువారం ఖేడ్‌లోని ఆయన స్వగృహంలో 19 మంది లబ్ధిదారులకు రూ.6.85 లక్షల సహాయనిధి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. అర్హులైన పేదలందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, కాంగ్రెస్ మండల నాయకులు తాహేర్, సాయిలుపటేల్, సుభాష్‌రావు, శంకర్‌గౌడ్, పండరినాథ్ పాల్గొన్నారు. కాగా చాప్టా గ్రామానికి చెందిన శేరికార్ ఈరమ్మకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.36 వేల చెక్కును కాంగ్రెస్ నాయకులు సాగర్‌షెట్కార్ అందజేశారు.

నర్సాపూర్ నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయాలి

● సీఎంను కలిసిన ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలతో పాటు పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సీఎం స్వగృహంలో కలిసి మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలపాలని, నర్సాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుచేసి నిధులు కేటాయించాలని, నియోజకవర్గ కేంద్రంలో కోర్టు భవనం, ఆర్డీవో, తహసీల్దార్, వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల సొంత భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. కొత్తగా ఏర్పడిన చిలప్‌చెడ్, మాసాయిపేట మండలాల్లో పలు మండల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలోని పలు గ్రామాల రోడ్ల విస్తరణకు రూ.156 కోట్లు మంజూరు చేయాలని సీఎంను కోరగా.. సానుకూలంగా స్పందించారని ఆవుల రాజిరెడ్డి తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డితో ఆవుల రాజిరెడ్డి

రైతుల ప్రయోజనం కోసమే రుణాల రెన్యూవల్

● తెలంగాణ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్

నారాయణఖేడ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనం కోసమే పంట రుణాలను సకాలంలో రెన్యూవల్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ వినయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు పరిధిలో దత్తత గ్రామాలు అధికంగా ఉండడంతో రుణాలు పొందిన రైతులు అధిక సంఖ్యలో రెన్యూవల్ కోసం వస్తున్నారని, అయినప్పటికీ రాత్రి వరకు తమ సిబ్బంది రెన్యూవల్ చేస్తున్నారన్నారు. గతేడాది ఇదే సమయంలో రుణమాఫీ కావడంతో అధికశాతం రైతులు ఒకేసారి రుణమాఫీ సదుపాయం పొందడంతో, రెన్యూవల్ గడువు ఒకేసారి వచ్చిందని, అందువల్ల రైతులు వడ్డీ రాయితీ సౌకర్యం కోల్పోకుండా ఉండడం కోసమే రెన్యూవల్‌ను సకాలంలో చేస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని ఈ తక్షిల పాఠశాలకు చెందిన విద్యార్థినులు మనీషా, శ్రీజ, సాయినిత, అక్షయ అండర్-14, 17 బాలికల విభాగాల్లో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శరత్ కుమార్, ప్రిన్సిపల్ అవిక, పీఈటీ శ్రీనాథ్ తెలిపారు.

చోరీ కేసులో సొత్తు రికవరీ

● నిందితురాలికి రిమాండ్

జోగిపేట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో సొత్తును రికవరీ చేసి మహిళను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు. ఈనెల 8న మనూరు మండలం ఉసిరికపల్లికి చెందిన కుర్మా పార్వతమ్మ జోగిపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని దుండగులు ఆమె బ్యాగులోంచి 8 తులాల బంగారు ఆభరణాలను తస్కరించారు. బాధితురాలు జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి జోగిపేట బస్టాండ్‌లోని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కాగా అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా భారత్‌నగర్‌తండాకు చెందిన శ్వేతకాలిని తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నదన్నారు. ఆమె నుంచి 3 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దోపిడీ దొంగల అరెస్ట్

జహీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దోపిడీ దొంగలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని జహీరాబాద్ పట్టణ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని పస్తాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న మహ్మద్ జమీలొద్దీన్, మహ్మద్ ఫయ్యాజొద్దీన్‌ను తనిఖీ చేస్తున్న క్రమంలో పారిపోయేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వెంటపడి పట్టుకుని విచారించగా.. ఈనెల 12 పట్టణ సమీపంలోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద ఓవైన్స్‌లో రూ.50 వేలు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. ఈ మేరకు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,700 నగదు, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చామన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతపై దృష్టిసారించాలి : జడ్పీ సీఈవో

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల స్వచ్ఛతపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. గురువారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాల స్వచ్ఛత, అభివృద్ధి అంశాలపై సిబ్బందితో చర్చించి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రతీ ఇంటి ముందు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కార్యాలయ స్థితిగతులపై ఆరాతీసి, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గిరిజారాణి, సీనియర్ అసిస్టెంట్ శ్రీలత పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎల్లయ్య

పలు మండలాల్లో స్వచ్ఛతాహీ సేవా పక్వాడ్ కార్యక్రమం

సంగారెడ్డి అర్బన్/నర్సాపూర్/నారాయణఖేడ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని పలు వార్డుల్లో స్వచ్ఛభారత్ గురువారం నిర్వహించారు. పట్టణంలోని స్నేహ నగర్‌లోని హనుమాన్ మందిర్ పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, రాష్ట్ర నాయకుడు దేశ్‌పాండే పాల్గొన్నారు. నర్సాపూర్ పట్టణంలోని జూనియర్ కాలేజీ ప్రాంగణం, మున్సిపల్ కార్యాలయంలో బీజేపీ ముఖ్య నాయకులు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.మల్లేశ్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్ పాల్గొన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతాహీ సేవా నిర్వహించారు. కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వెంకటశివయ్య, పారిశుధ్య కార్మికులతో ర్యాలీ నిర్వహించారు.

తేలని లెక్క

(5వ పేజీ తరువాయి)

ఖర్చులు వృథా అయ్యాయి. తిరిగి సాగు చేయడానికి విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు డబ్బు వెచ్చించాలి. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రైతులు కొత్త పెట్టుబడులు పెట్టడానికి వెనకాడుతున్నారు.

3,21,436 ఎకరాల్లో సాగు

వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 3,21,436 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు వేశారని అధికారులు లెక్కతేల్చారు. అత్యధికంగా వరి నాట్లు 2,78,795 ఎకరాల్లో వేశారు. మెదక్, హవేళిఘణపూర్, పాపన్నపేట, కొల్చారం, టేక్మాల్, కౌడిపల్లి, నర్సాపూర్, రామాయంపేట, నిజాంపేట చిన్నశంకరం పేట, చేగుంట, మాసాయిపేట, తూప్రాన్, వెల్దుర్తి, శివంపేట తదితర మండలాలలో రైతులు వరి సాగు చేస్తున్నారు. అల్లాదుర్గం, పెద్ద శంకరంపేట, రేగోడ్, టేక్మాల్ మండలాల పరిధిలో 34,283 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. మిగిలినవి ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలుస్తున్నది. కానీ, అధికారికంగా ఇప్పటికీ పంట నష్టం లెక్కలు తేల్చలేదు. ఆలస్యం కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొక్కుబడిగా పంటలు పరిశీలించి తక్కువ నష్టంగా చూపుతారని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే నష్ట పరిహారం ఎప్పటికి వస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంట నష్టం అంచనాలను రూపొందించేలా ఆదేశించాలని కోరుతున్నారు.

వదలని వాన

(5వ పేజీ తరువాయి)

స్తున్నారు. చెరువు నిండి అలుగుపారితే వెంచర్‌లో రోడ్డు నీట మునగడంతో దూరాన వాహనాలను నిలిపి వరద నీటిలో నడుస్తూ ఆఫీసులకు చేరుకుంటున్నారు. వరద తగ్గేవరకు ఇలాగే ఇబ్బంది పడాల్సి వస్తున్నదని సిబ్బంది వాపోయారు.

పంటలకు నష్టం

కోహీర్ నారింజ వాగు పరవాక ప్రాంతంలోని వందల ఎకరాలోని పంట పొలాలు నీట మునిగాయి. మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు కృష్ణాపూర్, చీలపల్లి, జీర్లపల్లి, బొరెగావ్, బొప్పన్‌పల్లి గ్రామాల్లో బుధవారం రాత్రి 7 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లోనే అత్యధిక వర్షం కురియడంతో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. పంట పొలాల్లో వరద నీరు నిలువడంతో పత్తి, సోయా పంటలు దెబ్బతిన్నాయి. నారాయణఖేడ్ డివిజన్‌లో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నారాయణఖేడ్, కల్హేర్, నిజాంపేటమనూరు, నాగల్‌గిద్ద, సిర్గాపూర్ మండలాల్లో పత్తి, మొక్కజొన్న, సోయా చేలల్లో నీరు నిలిచింది.

చెరువులా రేడియల్ రోడ్డు ఎక్సెటెన్షన్-7

రామచంద్రాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రేడియల్ రోడ్డు ఎక్స్‌టెన్షన్-7 వర్షపు నీటితో చెరువులా మారింది. చెరువుల్లోకి వరద నీటిని మోసుకు వచ్చే కాలువలు ఎక్కడికక్కడ బిల్డర్లు మూసివేయడం, మళ్లించడంతో ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు మండిపడుతున్నారు.

కాంగ్రెస్ పాలనలోనే యూరియా కష్టాలు

చేగుంట సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి మాతృమూర్తి దశదినకర్మలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, కమ్మర్ వెంకటేశం, గోపాల్, వెంకటరెడ్డి, ప్రభాస్ రెడ్డి, మెతుకు శ్రీను, శివ పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలి

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ గురువారం విధులు బహిష్కరించి, రోడ్డుపై నిరసన చేపట్టారు. అయితే సంగారెడ్డిలో చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ రోడ్డెక్కారు. ప్రభుత్వం స్పందించి న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకువచ్చే వరకు ఈ ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీ మద్విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా సంగారెడ్డి పోతిరెడ్డిపల్లిలోని సంఘ భవనంలో గురువారం యజ్ఞం నిర్వహించారు. భవనంలో ప్రతిష్ఠించిన విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక యోగా గురువు మన్యార్‌పల్లి యోగా ఆంజనేయులుచారి, సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్ల అశోక్‌చారి, ఉపాధ్యక్షుడు వి.బ్రహ్మంచారి పాల్గొన్నారు. విశ్వజయంతిలో భాగంగా శుక్రవారం 4 గంటలకు విశ్వకర్మ భగవానుని శోభాయాత్ర నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు అశోక్‌చారి తెలిపారు.



విశ్వకర్మ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న అశోక్‌చారి తదితరులు

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

గుమ్మడిదల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సమస్యలను గుర్తించి వారి కుటుంబాల భవిష్యత్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం గుమ్మడిదలలోని సీజీఆర్ ట్రస్టు కార్యాలయంలో ఫొటోగ్రాఫర్ల సంఘ సభ్యులతో బీఆర్ఎస్ నాయకులు సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లో ఈనెల 19, 20, 21 తేదీల్లో జరగబోయే ఫొటోగ్రాఫర్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు.